క్లుప్తంగా

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


క్రీడాకారిణి రేణుక

కర్నూలు (టౌన్): ఈనెల 25వ తేదీన జరగనున్న బెంగుళూరు ఏ డివిజన్ ఫుట్‌బాల్ పోటీలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.రేణుక ఎంపికైంది. బి.క్యాంపులోని లక్ష్య కోచింగ్ క్యాంపులో శిక్షణ తీసుకుంటున్న ఈ ఫుట్‌బాల్ క్రీడాకారిణి ఎంపిక కావడం పట్ల జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ముప్పా రాజశేఖర్, విజయ్‌కుమార్, లక్ష్య కోచ్ బ్రహ్మకుమార్ అభినందనలు తెలియజేశారు.

వ్యవసాయ అధికారుల సంఘం డైరీ విడుదల


డైరీని విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ అధికారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించే విధంగా రైతుల్లో అవగాహన పెంచాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి దస్తగిరి రెడ్డి, కోశాధికారి రామకృష్ణ, వ్యవసాయ అధికారులు రాఘవేంద్ర, అల్లిపీరా, మధులత, అనురాధ రెడ్డి, శారద, ఉషారాణి పాల్గొన్నారు.

26న మాంసం విక్రయాల నిషేధం

కర్నూలు (టౌన్): గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 26వ తేదీన మాంసం విక్రయాలపై నిషేధం విధించినట్లు నగర పాలక ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కబేళాలు, మాంసం దుకాణాలను ఆదివారం రోజున మూసివేయాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో సైతం మాంసాహారం విక్రయించరాదని ఆదేశించారు. నిషేధాజ్ఞలు విస్మరించే వ్యాపారులకు భారీగా జరిమానా విధించడంతో పాటు ట్రేడ్ లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. వ్యాపారులు సహకరించాలని కోరారు.

కష్టపడే వారికి పదవులు వరిస్తాయి

● కాటసాని రాంభూపాల్‌రెడ్డి


కాటసానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

కల్లూరు: పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి గుర్తింపుతో పాటు పదవులు వరిస్తాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పార్టీలో పాణ్యం నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన తిరుపాల్, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, హుస్సేన్ ఆలం, భవాని, గోవర్ధన్‌రెడ్డి గురువారం సాయంత్రం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శివ నరసింహారెడ్డిని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్వీసీ కాంప్లెక్స్ : సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ ఛేంజర్, స్కై ఫోర్స్ హాంకాంగ్ వారియర్స్, ఐడెంటిటీ (2025)
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ ఛేంజర్, పుష్ప–2 : ది రూల్ రీ లోడెడ్, హాంకాంగ్ వారియర్స్, ఐడెంటిటీ (2025), గాంధీ తాత చెట్టు, హత్య
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ ఛేంజర్
శ్రీరామ : సంక్రాంతికి వస్తున్నాం
రాజ్ : సంక్రాంతికి వస్తున్నాం
భరత్ కాంప్లెక్స్ : తల్లి మనసు, పుష్ప–2 : ది రూల్ రీలోడెడ్
విజయ థియేటర్ : సంక్రాంతికి వస్తున్నాం
విక్టరీ టాకీస్ : జనక అయితే గనక

రోడ్లన్నీ గుంతలే!

● ప్రధాన రహదారులపై భారీ సైజు గుంతలు
● హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు
● రూ.30 కోట్లతో చేపట్టిన ప్యాచ్ వర్కులు ఏమయ్యాయో?


కొత్త బస్టాండ్ సమీపంలో నడిరోడ్డుపై గుంత


వెంకటరమణ కాలనీకి వెళ్లే రహదారిలో గుంత

కర్నూలు న్యూసిటీ: రాష్ట్రంలో గుంతలు లేని విధంగా రహదారులను తీర్చిదిద్దుతామని నాడు ప్రగల్భాలు పలికిన కూటమి పార్టీల నేతలు ఇప్పుడు కనీసం జిల్లా కేంద్రంలోని రోడ్లపై గుంతలను సైతం పూడ్చలేకపోతున్నారు. కనీసం ప్యాచ్ వర్కులు కూడా చేపట్టకపోవడంతో నిత్యం పట్టణవాసులు గుంతలమయంగా ఉన్న రోడ్లపై ప్రయాణించలేక నరకం చూస్తున్నారు. అధికారం చేపట్టి 7 నెలలు దాటినా పూర్తిస్థాయి రోడ్లను నిర్మించకపోగా కనీసం మరమ్మతులు కూడా సరిగా చేయకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్యాచ్ వర్కుల పేరుతో కూటమి నాయకుల జేబులు నింపేందుకు అంచనాలకు మించి రూ.30 కోట్లను మంజూరు చేసినా, అక్కడక్కడ తారు పూసేసి కోట్లాది రూపాయలను కొల్లగొట్టారు. కర్నూలు నగరంలోని ఆర్‌ఎస్ సర్కిల్ కూడలిలో జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్ ప్యాచ్ వర్కులతో రహదారుల సుందరీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయినప్పటికీ నగరంలోని చాలా రోడ్లపై భారీ సైజు గుంతలు దర్శనమిస్తూ వాహదారులకు వణుకు పుట్టిస్తున్నాయి.

అడుగడుగునా గుంతలు

నగరంలో అడుగడుగునా గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే మార్గంలో ఎక్కడ చూసినా గుంతలు అడ్డురావడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొత్త బస్టాండ్‌కు సమీపంలో రహదారిని అభివృద్ధి, మరమ్మతుల పేరిట తవ్వేసి వదిలేశారు. కనీసం అక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. ఆ రహదారిలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు తిరుగుతుంటాయి. అలాంటి రహదారి మధ్యలో గుంతలు ఉండడంతో వాహనాలు నడిపేవారు వాటిని తప్పించే క్రమంతో పక్కనే వస్తున్న వాహనాలను ఢీకొంటూ ప్రమాదాలకు గురవుతున్నారు.

ఆర్‌ఎస్ కూడలి నగరంలో అతిపెద్ద కూడలి. అక్కడికి ఒక రైల్వేస్టేషన్‌కు వెళ్లే వాహనాలు, ఇంకోవైపు మున్సిపల్ కార్యాలయం, హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు, మరోవైపు పాత నగరం, జిల్లా పరిషత్‌కు వెళ్లే వాహనాలు, వాటి ఎదురుగా మౌర్యఇన్, రాజ్‌విహార్ వెళ్లే వాహనాలు, దాని పక్కన కొత్తబస్టాండ్‌కు వెళ్లే వాహనాలు వేల సంఖ్యలో ప్రయాణిస్తుంటాయి. అలాంటి రహదారిలో వాటర్ పైపులైన్లు లీకు కావడంతో మరమ్మతులు చేసేందుకు నడిరోడ్డుపై గుంతలు తవ్వేశారు. దీంతో సర్కిల్ రూపంలో ఉన్న రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను తప్పించి వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● కొత్త బస్టాండ్ నుంచి వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, సీతారామనగర్ కాలనీలకు వెళ్లే రహదారిలో రెండు మూడు చోట్ల నడిరోడ్డును తవ్వేయడంతో అటు వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బబందులకు గురవుతున్నారు.
● కొత్తబస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వెళ్లే మార్గంలో ఈద్గా వద్ద పైపులైన్ మరమ్మతుల కోసం నెల రోజుల క్రితం రోడ్డును తవ్వేశారు. గత మూడు రోజుల క్రితం ఈద్గా ముందు ఒక షాపింగ్ కాంప్లెక్స్ ముందు మురుగు కాలువ నిర్మాణం కోసం రోడ్డును తవ్వడంతో వాహదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికీ అక్కడ రోడ్డు వేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దానికి వ్యతిరేక రహదారిలో కూడా రహదారిని తవ్వేసి పైపులైను మరమ్మతులు చేపట్టారు.

నగరంలోని ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా అధికారులు మాత్రం రోడ్లన్నీ అందంగా తీర్చిదిద్దామనే భ్రమలో ఉన్నారు. రోడ్లపై పడిన గుంతలు ప్రత్యక్షంగా కనిపిస్తున్నా, నగరంలో తిరిగే నాయకులు, ఉన్నతాధికారులకు కనిపించడం లేదా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని నగరవాసులు కోరుతున్నారు.


సీతారాం నగర్ ఆటో స్టాండ్ సమీపంలో తవ్వేసిన రోడ్డు


కొత్తబస్టాండ్ రహదారిలో తవ్విన రోడ్డు


ఆర్‌ఎస్ కూడలిలో తవ్వేసిన రోడ్డు

నేడు వ్యవసాయ విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖలో 220 కేవీ లైన్ల ఏర్పాటు వల్ల కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు మండలాలకు ఈనెల 24వ తేదీన వ్యవసాయ విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఈఈ శేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నన్నూరు 400 కేవీ సబ్‌స్టేషన్ నుంచి కార్బైడ్ సబ్‌స్టేషన్‌కు 220 కేవీ నూతన లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మూడు మండలాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు. అలాగే క్యాంపు సబ్‌స్టేషన్ పరిధిలోని కాలనీలు, నగరాలలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి సమిష్టి కృషి చేయాలని ప్రభుత్వ 20 సూత్రాల ప్రోగ్రాం చైర్మన్ లంక దినకర్ సూచించారు. గురువారం కర్నూలు పర్యటనకు వచ్చిన ఆయన నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసి వారికి ఎప్పటికైనా పదవులు వస్తాయన్నారు. పదవులు రావని నిరాశ చెందొద్దన్నారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి అందరినీ కలుపుకొని పోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో బీజేపీకి ప్రాధాన్యం ఇవ్వడం లేదనేది వాస్తవం కాదన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు లేని నియోజక వర్గాల్లో బీజేపీ నాయకులు ఇతర పార్టీ నాయకులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామస్వామి, నాగరాజు, రాష్ట్ర నాయకులు రాఘవేంద్ర, గీతా మాధురి, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

26న ర్యాలీకి పిలుపు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా జనవరి 26వ తేదీన జిల్లా కేంద్రంలో ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో రైతు, కార్మిక సంఘాల నాయకులు సమావేశమై ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు.

ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న భారతి

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీలో విద్యార్థినులను వేధిస్తున్న ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగన్న, అబ్దుల్లా డిమాండ్ చేశారు. విశ్వ విద్యాలయాల్లో మేధావులను తయారు చేయాల్సిన ప్రొఫెసర్లు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడం అన్యాయమన్నారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. తెలుగు డిపార్టుమెంట్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓబులేసు మద్యం సేవించి రాత్రి సమయంలో విద్యార్థినులకు ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడుతున్నారని, ఈ ఘటనపై జనవరి 10న విద్యార్థినులు వైస్ చాన్స్‌లర్‌కు ఫిర్యాదుచేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గతంలో కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఓ ప్రొఫెసర్ కూడా ఇలాగే ప్రవర్తించారని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రొఫెసర్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు.

కీచక ఉపాధ్యాయుడిని ఉద్యోగం నుంచి తొలగించాలి

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు మండలం వెంకటగిరి ప్రాథమిక పాఠశాలలో బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడు లక్ష్మన్నను ఉద్యోగం నుంచి తొలగించాలని ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి భారతి డిమాండ్ చేశారు. ఆమె గురువారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ.. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువే పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకోక తప్పదన్నారు. అతనిపై పోక్సో కేసు నమోదు చేసి బెయిల్ రాకుండా చూడాలన్నారు. నాయకురాళ్లు పావని, శైలజ పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ యావత్ ఆస్తిని ధారపోసి, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో మరణం లేని మహనీయుడిగా కీర్తింపబడ్డారన్నారు. ఇలాంటి త్యాగశీలురను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందరెడ్డి, మగ్బుల్ బాషా, ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

కర్నూలు (సిటీ): స్థానిక క్లస్టర్ విశ్వ విద్యాలయ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు)లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి అధ్యక్షతన నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అధ్యాపకులు ఎ.వెంకటస్వామి, జి.నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ జె.హేమంత్, తదితరులు పాల్గొన్నారు.



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ ఉద్యోగులు

ఏ.క్యాంప్‌లోని మైపర్ ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మహాలక్ష్మి ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. నేతాజీ జీవిత చరిత్రను, స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటాన్ని వివరించారు. వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30న టీకేఆర్ శర్మ శతజయంతి

కర్నూలు కల్చరల్: క్లస్టర్ విశ్వవిద్యాలయం, సాహితీ సదస్సు సంయుక్త ఆధ్వర్యంలో కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలోని ప్రకాశం సభా భవనంలో ఈ నెల 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు గాంధేయ వాది, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రకేసరి అనుచరుడు, పూర్వ శాసన సభ్యుడు టీకేఆర్ శర్మ శతజయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సాహితీ సంస్థ, గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర తెలిపారు. ×గాంధేయ సమతావాదం₹ అనే అంశంపై వక్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ అధ్యక్షుడు టంగుటూరి శ్రీరామ అతిథులుగా హాజరు కానున్నట్లు వెల్లడించారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



ర్యాలీగా వస్తున్న ఆటో కార్మికులు

కర్నూలు(సెంట్రల్): ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. గురువారం ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ 9వ నగర మహాసభలు రాజ్‌విహార్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. అంతకుముందు కలెక్టరేట్ నుంచి అంబేడ్కర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.కృష్ణయ్య జెండాను ఆవిష్కరించి మహాసభలకు అంకురార్పణ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్.మునెప్ప మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసరాలు, పెట్రో ఉత్పత్తుల ధరలు కార్మికులకు కంటిమీద కనుకు లేకుండా చేస్తున్నాయన్నారు. ఇదే సమయంలో పోలీసులు, ఆర్టీఏ అధికారులు ఫైన్లతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబునాయుడు ఆటో డ్రైవర్లకు ఇచ్చే సాయాన్ని రూ.15 వేలకు పెంచుతామని చెప్పారని, అయితే ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, రూ.50 లక్షల ప్రమాద బీమా కల్పించాలని, పిల్లల చదువులు, ఆరోగ్యం కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ట్రాఫిక్ సీఐ నసీరుద్దీన్, ఎస్‌ఐ వెంకటేష్ సూచించారు. ఆటో యూనియన్ నాయకులు మధు, ఈశ్వర్, గణేష్, ఏఐటీయూసీ నాయకులు వెంకటేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

27న శ్రీకృష్ణదేవరాయల జయంతి

కర్నూలు(అర్బన్): విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను ఈ నెల 27వ తేదీన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు కోనేటి చంద్రబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీకృష్ణదేవరాయల జయంతి విషయంలో సందిగ్ధత తొలగిపోయిందన్నారు. శ్రీకృష్ణదేవరాయల కుమార్తె మోహనాంగి రాసిన మరీచి పరిణయం అనే కావ్యంలో రాయలవారి జన్మదినం గురించి ప్రస్తావించిందన్నారు. వికృతి నామ సంవత్సరం, పుష్య మాసం, కృష్ణపక్షం, ద్వాదశి, శుక్రవారం శ్రీకృష్ణదేవరాయలు జన్మించారని పేర్కొన్నారని తెలిపారు. మరీచి పరిణయంలోని ఈ పేజీలను శ్రీ పోలిశెట్టి సత్తిరాయుడు సేకరించారన్నారు. అఖిల భారత కాపు బలిజ చరిత్ర సంకలన సమితి కన్వీనర్ దూపం అభిమన్యుడు, జిల్లా ప్రముఖ జ్యోతిష్కులు అమరం నరేష్ నిర్ధారణ మేరకు ఈ నెల 27వ తేదినే శ్రీకృష్ణదేవరాయల జయంతిని జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేపు 'సర్వ భాషా సమ్మేళనం' ప్రసారం

కర్నూలు(సెంట్రల్): రిపబ్లిక్ డే పురస్కరించుకొని నిర్వహించే సర్వభాషా సమ్మేళనం కార్యక్రమాన్ని జనవరి 25వ తేదీన రాత్రి పది గంటల నుంచి ఆకాశవాణి ద్వారా తెలుగులో అనువాద ప్రసారం చేస్తామని హైదరాబాద్ ఆకాశవాణి ప్రోగ్రాం హెడ్ కేఎల్ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం జాతీయ తెలుగు కవిగా ఎంపికైన ఏనుగు నరసింహారెడ్డి తెలుగు అనువాదం చేస్తారని, ఈ కార్యక్రమాన్ని ఎండబ్ల్యూ 738 కేహెడ్జ్, ఎఫ్ఎం 101.9 చానల్ ద్వారా వినవచ్చని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు .. ఎమ్మిగనూరు మండలం కల్లుగోట్ల గ్రామానికి చెందిన దావీదు, మనవరాలు కృపమ్మతో కలిసి నందవరం మండలంలోని సంజీవపురం గ్రామంలో బంధువు మృతి చెందడంతో మట్టికి వెళ్లారు. మట్టి ఇచ్చి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. అలాగే తెలంగాణ రాష్ట్రం, కొత్తపల్లి గ్రామానికి చెందిన తెలుగు వెంకటేష్ మంత్రాలయం నుంచి కారులో కొత్తపల్లికి బయలుదేరాడు. మార్గ మధ్యలో నాగలదిన్నె సబ్‌స్టేషన్ సమీపంలో అతివేగంగా వస్తూ వెంకటేష్ కారుతో బైక్ వెనుక భాగంలో ఢీకొట్టాడు. అనంతరం కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న దావీదుకు స్వల్ప గాయాలు, కృపమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని స్థానికులు ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ వైరు చోరీ

వెల్దుర్తి: స్థానిక పంచాయతీ నీటి పథకానికి చెందిన విద్యుత్ మోటారు వైరు చోరీకి గురైనట్లు పంచాయతీ అధికారి లక్ష్మీనాథ్ తెలిపారు. పట్టణానికి తాగునీరందించే బ్రహ్మగుండం పథకానికి సంబంధించిన రెండు మోటార్ల దాదాపు 160 మీటర్ల వైరు బుధవారం రాత్రి చోరీకి గురికాగా, రూ.30 వేల నుంచి రూ.40వేల నష్టం సంభవించిందన్నారు. దీంతో తాగునీటి సరఫరాకు స్వల్ప అంతరాయం కలుగగా, చోరీ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

స్థానికంగా మందులు కొనేందుకు టెండర్లు

● వైద్యులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
● పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి అవసరమైన అత్యవసర మందులు, సర్జికల్స్, ఇన్‌ప్లాంట్స్ స్థానికంగా కొనేందుకు టెండర్లు పిలుస్తున్నామని, ఇందుకు అవసరమైన మందులను ప్రతిపాదించాలని వైద్యులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో అన్ని విభాగాధిపతులు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవలకు సంబంధించి ప్రభుత్వం నుంచి కొత్త టార్గెట్లు వచ్చాయని, వాటిని అనుసరించి ఇప్పుడు మరింత పెంచి అమలు చేయాలని ఆదేశించారు. ఈ–హాస్పిటల్‌లో డిశ్చార్జ్ ఐపీ మాడ్యూల్స్‌ను ఇంకా మెరుగుపరచాలన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో వీలైనంత త్వరగా సేవలు ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. ఆసుపత్రిలోని ఓపీ నంబర్ 333 (వెల్‌నెస్ క్లినిక్) ప్రారంభించామని, ఇది సోమ, బుధవారాల్లో కొనసాగుతుందన్నారు. దీనికి సంబంధించి ఆయా విభాగాల నుంచి అవసరమైన రోగులను రెఫర్ చేసి వారికి కౌన్సెలింగ్ ఇచ్చేలాగా చూడాలని హెచ్‌ఓడీలను ఆదేశించారు. అన్ని ఓపీ విభాగాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంబంధిత సీనియర్ ఫ్యాకల్టీ వైద్యులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. న్యూ డయాగ్నోస్టిక్ విభాగం మొదటి అంతస్తులో హిమోగ్లోబినోపతి (ఐసీహెచ్‌హెచ్) రక్తపరీక్షల కేసుల నమోదు కోసం నమూనాలను ప్రతి మంగళ, శుక్రవారం ల్యాబ్‌కు పంపించాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంస్కృతికాంశాల్లో పోటీలు

కర్నూలు కల్చరల్: రిపబ్లిక్ డే పురస్కరించుకొని కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు కొండారెడ్డి బురుజు సమీపంలోని పార్క్‌లో విద్యార్థులకు సాంస్కృతికాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.మనోహర్‌బాబు తెలిపారు. దేశభక్తి గీతాలు, భరత నాట్యం, కూచిపూడి, జానపద నృత్యం, ఏకపాత్రాభినయం తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా 88863 74796, 77029 44714 సెల్ నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

స్వచ్ఛతపై దృష్టి సారించాలి


కళాశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న అధికారులు, మెడికోలు

కర్నూలు(హాస్పిటల్): ప్రతి వైద్య విద్యార్థి స్వచ్ఛత వైపు అడుగులు ముందుకు వేయాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలోని విద్యార్థులు, సిబ్బందితో కలిసి ప్లే గ్రౌండ్‌ను శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల ను, చదువుకునే ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యం బాగుంటుందని, తద్వారా సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండ్‌క్రాఫ్ట్ ఎంప్లాయిూస్ అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్‌ను ఉమ్మడి కర్నూలు జిల్లా ఎన్జీఓ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్ ఆవిష్కరించారు. పశుసంవర్ధక శాఖలోని చాంబరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. హియరింగ్ హ్యాండ్‌క్రాఫ్ట్ ఉద్యోగుల అభ్యున్నతికి ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, హియరింగ్ హ్యాండ్‌క్రాఫ్ట్ ఉద్యోగుల సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

నేడు గుర్తింపు కార్డుల పంపిణీ

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు, అసంఘటిత రంగంలోని కార్మికులకు ఈ–శ్రామ్ కార్డులను లేబర్ డిపార్టుమెంట్ ద్వారా ఇప్పించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి/జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.కబర్ది గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సిల్వర్‌జూబ్లీ కళాశాలలో జరిగే నల్సా న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపులో కార్మికులకు కార్డులను ఇప్పించనున్నట్లు వెల్లడించారు.

PUBLIC NOTICE

ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన Shaik Younus Basha S/o Shaik Hamja Basha, H.No. 6-51, SC Colony, మిద్తూరు గ్రామం & మండలం, నందికొట్కూరు తాలుకా, నంద్యాల జిల్లా అను నా క్లయింట్ దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి చెందిన ఒరిజినల్ లింక్ దస్తావేజు నెం. 6222/1989, తేది: 28-12-1989 తన స్వగ్రామమైన మిద్తూరు నుండి కర్నూలుకు వెళ్ళే మార్గంలో పోగొట్టుకొని యున్నారు. కావున సదరు దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల దిగువ తెలిపిన అడ్రస్సులో గాని (లేదా) నా క్లయింట్ అడ్రస్సులో గాని తెలియపర్చగలరు అట్లుగాక సదరు దస్తావేజులు ఎవరైనా దుర్వినియోగ పర్చిన యెడల నా క్లయింట్ తీసుకొనబోవు చట్టపరమైన చర్యలకు బాధ్యులగుదురు.
షెడ్యూలు: కర్నూలు డి., కల్లూరు సబ్ డి., కర్నూలు సిటి మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా నెం. 87వ వార్డు రాంభూపాలనగర్ నందలి ప్లాటు కల్లూరు 687/ఎ2, 687/ఎ1 సబ్ డివిజన్ నెం. 687/ఎ2ఎ, 687/ఎ1 ఈ సర్వే నెంబర్లు గల భూమి వేయబడిన ప్లాటును ఎల్.పి.నెం. 111/87 అప్రూవల్ కాబడిన రాంభూపాలనగర్ నందలి ప్లాటు పైకి నెం. 128 ప్లాటులో పడమర దిశనైపున అర్థభాగము ప్లాటు ఇందుకు చెప్పబంది. **తూర్పు:** ఇదే నెంబరు ప్లాటులోని అర్థం ప్లాటు, **పడమర:** నెం. 127 ప్లాటు **ఉత్తరం:** నెం. 118 ప్లాటు, **దక్షిణం:** 33 అ॥ వెడల్పు గల రోడ్. **కొలతలు:** ఉత్తరం-దక్షిణం 60 అ॥ లేక 18.2880 మీ॥, తూర్పు-పడమర: 20 అ॥ లేక 6.0690 మీ॥. ఈ ప్లాటు పూర్తి విస్తీర్ణం 1200 చ.అ. లేక 133.33 చ.గ. గలదు.

G.S.Vijaya Bhaskar Reddy,
B.A.,B.L., Advocate
Address : H.No.87-1077, Ganesh Nagar, Nandyal Road, Near Partha Sarathi Towers, Kurnool.
Cell: 9347928866, 9985474567